క్లుప్తంగా

విశాఖ ఉక్కు నుంచి రూ.3.41 కోట్ల ఆస్తి పన్ను వసూలు



జెడ్సీకి ఆస్తి పన్ను చెక్కు అందజేస్తున్న ఏసీ రామనారాయణ తదితరులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ అధికారులు విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి రూ.3,41,47,156 ఆస్తి పన్ను వసూలు చేశారు. ఈ మేరకు గాజువాక జోన్ సహాయ కమిషనర్ సీహెచ్.రామనారాయణ, రెవెన్యూ అధికారి ఎం.శ్రీకాంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కోరాడ శివ తదితరులు స్టీల్‌ప్లాంట్ అధికారుల నుంచి తీసుకొచ్చిన చెక్కును శుక్రవారం జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ అధికారులను అభినందించారు. ఆస్తి పన్ను పూర్తిస్థాయిలో వసూలు చేయడానికి కృషి చేయాలని సూచించారు.

విజ్ఞాన్ ప్రొఫెసర్‌కు ద్రోణాచార్య అవార్డు



ద్రోణాచార్య అవార్డు గ్రహీత, అధ్యాపకుడు గిరీష్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

అగనంపూడి: జాతీయ స్థాయి గోకార్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ గిరీష్ బియోగడేకు ద్రోణాచార్య అవార్డు దక్కింది. ఈ మేరకు కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ప్రొఫెసర్ గిరీష్‌తో పాటు బృందాన్ని సత్కరించారు. ఈనెల 17 నుంచి మూడు రోజుల పాటు కాకినాడ ఆదిత్య విశ్వవిద్యాలయంలో గోకార్ట్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, మెకానికల్ విభాగం హెడ్ రాంబాబు, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్‌తో భరోసా



పోస్టల్ శాఖ ద్వారా ఇన్సూరెన్స్ నమోదు చేయిస్తున్న ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ హార్ట్‌ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులకు పోస్టల్ శాఖలో ఇన్సూరెన్స్ నమోదు చేశారు. పోస్టల్ సిబ్బంది శుక్రవారం సంస్థలోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అసోసియేషన్‌లోని సుమారు 300 మంది సభ్యులకు రూ.10 లక్షల చొప్పున ఇన్సూరెన్స్ చేస్తున్నట్టు తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించినా, అనారోగ్య సమస్యలు వచ్చినా ఈ ఇన్సూరెన్స్ భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో రాము, రవికిషోర్, రవి, కృష్ణ, సంతోష్, కరణం ముత్యాల నాయుడు, ఆనంద్, రవికుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ షోకాజ్ నోటీసు ఉపసంహరించుకోవాలి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్‌కు యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసు ఉపసంహరించుకోవాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండేను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్మిక సమస్యలపై పోరాడుతున్న అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడం అన్యాయమన్నారు. ఉద్యోగులకు పెండింగ్ ఉన్న 205 శాతం జీతాలను ఈనెల 31లోగా చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును తక్షణమే ఆపాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్. రావు, యు. రామస్వామి, రమణమూర్తి, కొవిరి అవతారం, జి. గణపతి రెడ్డి, డి.వి. రమణారెడ్డి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమా... ప్రణాళిక లోపమా!

అవును పోర్టు రోడ్డు విస్తరణ పనులు సాగుతున్న తీరు చూస్తే ఎవరికైనా అలానే అనిపిస్తుంది. కాలువలు, నాలాలను కప్పేసి రోడ్డు వేసేస్తున్నారు. వాడుకనీరు, వరదనీరు ఎలా ప్రవహిస్తుందోనన్న స్పృహ లేకుండా పనులు చేపడుతున్నారు. వరద నీటి ప్రవాహానికి అడ్డువేస్తే ఎలాంటి ముప్పు వస్తుందో బుడమేరు ఘటనతో అయినా కనువిప్పు కలగలేదు. మరి రాబోయే విపత్తులకు ఎవరిది బాధ్యత?.

త్వరలో మాయం కానున్న మారుతీ జంక్షన్ వద్ద నాలా



పొంచి ఉన్న వరద ముప్పు

మరో బుడమేరు ఘటన తప్పదని ప్రజల ఆందోళన

స్పందించని ప్రజాప్రతినిధులు

నాలాలు కప్పేస్తున్నారు!



కాలువ ఉన్న చోట వేసిన మట్టిపోగులు, ఇసుక

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నం పోర్టుకు లారీలు చేరుకోవడానికి ప్రత్యేక మార్గం నిర్మిస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా పనులు సాగుతున్న తీరు చూసి స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి దిగువకు వరదనీరు వెళ్లే కాలువలను మూసేస్తున్నారు. మరో వైపు మేహాద్రి రిజర్వాయర్ నుంచి వరదల సమయంలో విడుదల చేసే నీరు నాలాల గుండా సముద్రంలో కలుస్తుంది. అవేవీ పట్టించుకోకుండా నాలాలతో పాటు సముద్రంలోకి నీరు పారే కాలువలను కప్పేస్తున్నారు.

ఆరులైన్ల కనెక్టివిటీతో రోడ్డు నిర్మాణం

ఆరు లైన్ల కనెక్టివిటీతో విశాఖపట్నం పోర్టు రోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. భారత్‌మాల ప్రయోజన కింద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు షీలానగర్ నుంచి పోర్టు రోడ్డులోని మారుతీ జంక్షన్ వరకు సాగుతున్నాయి.



షీలానగర్ టోల్ గేటు వద్ద మాయం కానున్న కాలువ ఉన్న ప్రాంతం

కానరాని కల్వర్టులు

రోడ్లు వేయాలంటే ముందుగా నాలాలు ఉన్న చోట కల్వర్టులు నిర్మిస్తారు. కానీ ఈ పరిస్థితి మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో తాము ముంపునకు గురవుతామని దిగువ గ్రామాల వారు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేపట్టే ముందు పరిసర గ్రామాల పరిస్థితిని అంచనా వేయాలని అంటున్నారు ప్రజలు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కంటే వ్యాపారులకే పెద్దపీట వేస్తుందనడానికి ఈ రోడ్డు పనులే సాక్ష్యంగా నిలుస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

ఇరిగేషన్, రెవెన్యూ, జీవీఎంసీ విభాగాలు ఎక్కడ?

నివాస గ్రామాలకు అనుకొని జరుగుతున్న భారీరోడ్డు విస్తరణ పనులపై ఇరిగేషన్, రెవెన్యూ, జీవీఎంసీ విభాగాలు ముందుస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనులు చేపట్టాలి. కానీ ఇటు నాలాలు, భారీ కాలువలు మూసేసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొకపోతే విజయవాడలోని బుడమేరు పొంగి విజయవాడ సిటీని ముంచేసినట్లు తమకు ముంపు ముప్పు తప్పదని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ప్రతినిధులకు పట్టదా

ఇంత అడ్డగోలుగా విస్తరణ పనులు జరుగుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. తమ గ్రామాలు కొట్టుకుపోయినా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు.

నాలాలను మూసేస్తే ముప్పు

రోడ్డు విస్తరణ, నిర్మాణ పనుల్లో భాగంగా నాలాలు మూసేయడం దారుణమని పంచవటి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలాలు కప్పేస్తే రానున్న రోజుల్లో బుడమేరు పరిస్థితి తమకు వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచవటి, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, హరిజనజగ్గయ్యపాలెం, నవర, మింది, ములగాడ వరకు ఉన్న పలు ప్రాంతాలు ముంపునకు గురవుతాయని భయపడుతున్నారు.

8 నాలాలు కనుమరుగు

ఈ ప్రాంతంలో కాలువలు, నాలాలు సుమారు 8 వరకు ఉన్నాయి. గాజువాక నుంచి ములగాడ వరకు ఉన్న ప్రాంతాల నుంచి వాడుక నీటితో పాటు తుపానుల సమయంలో వరదనీరు వీటి గుండా సముద్రంలో కలుస్తుంది. అలాంటి నాలాలను కప్పేసి రోడ్డు నిర్మిస్తున్నారు. ఇటు వర్షాకాలంలో ఎక్కువ ఫ్లో అయిన సమయంలో మేఘాద్రి రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తారు. ఈ నీరు ఫ్లో అయ్యే కాలువను సైతం కప్పేసి రోడ్డు నిర్మిస్తున్నారు. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, నవర ప్రాంతాల నుంచి వర్షాకాలంలో వరద నీరు పంచవటి ప్రాంతం ఉన్న భారీ కాలువ ద్వారా సముద్రంలో కలుస్తుంది. ఇటు గాజువాక ప్రాంతాలైన ములగాడ, మింది వరకు పలు ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు, వర్షపునీరు పారే నాలాలను మూసేసి రోడ్డు నిర్మాణ పనులు సాగిస్తున్నారు.



మారుతీ జంక్షన్ నుంచి షీలానగర్ వైపు ఉన్న నాలాను కప్పేస్తున్న ప్రదేశం

పంచవటికి ముప్పు



పోర్టు రోడ్డుల వల్ల నాలాలు మూసేస్తే వరదల సమయంలో ముందుగా ముంపునకు గురయ్యేది పంచవటీయే. ముందస్తు ప్రణాళిక లేకుండా నాలాలు మూసేస్తే గ్రామాలకు గ్రామాలే ముంపునకు గురవుతాయి. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

– పి.చిన్నారావు, పోవా, అధ్యక్షుడు

అనాలోచిత చర్య



నాలాలు, కాలువలు మూసేస్తున్నారు. వరదనీరు సముద్రంలో కలవాలంటే ఇవే కీలకం. పలు ప్రాంతాల నుంచి నాలాల ద్వారా షీలానగర్ నుంచి మారుతీ జంక్షన్ వద్ద కాలువ గుండా సముద్రంలో కలుస్తుంది. నాలాలు మూస్తే వరద నీరు ఎక్కడికి వెళ్తుంది. అధికారులు ఆలోచించాలి.

– వై.రామ్మోహన్, పోవా, కార్యదర్శి

నాలాలు ఉన్న చోట కల్వర్టులు నిర్మించాలి



సుమారు 8కి పైగా ప్రధాన కాలువల ద్వారా పారి నాలాల ద్వారా సముద్రంలో వరదనీరు కలుస్తుంది. నాలాలు ఉన్న చోట కల్వర్టులు నిర్మించాలి. కానీ ఏకంగా రోడ్డు నిర్మించేస్తున్నారు. నాలాలను కప్పేస్తే సుమారు 10కి పైగా గ్రామాలు ముంపునకు గురవుతాయి. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– ఎ.మురళీ కృష్ణ, పంచవటి టెంపుల్ చైర్మన్

సైన్స్ ఫెయిర్‌లో మింది విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: కోరమాండల్ సంస్థలో నిర్వహించిన కోరమాండల్ ప్రయోగ్ ఉత్సవ్ 2025లో మింది జెడ్పీహైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల 18న నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో 30 స్కూల్స్ నుంచి 146 ప్రాజెక్టులు ప్రదర్శించారు. అందులో 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన స్మార్ట్ అగ్రికల్చర్ ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం లభించిందని పాఠశాల హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఆంజనేయ తెలిపారు. కంపెనీ సీఎస్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో విజేతలైన విద్యార్థులు ఎ.అమృత, ఎ.అమూల్య, సీహెచ్.చంద్రిక, బి.మహిమలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.త్రినాథ్, కె.సుజాత, వి.శ్రీనివాసరావు, డి.దేవానంద్, కోరమాండల్ అధికారులు జ్ఞానసుందరం, ఆర్.శ్రీనివాసరావు, రాజీవ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పీహెచ్‌సీ ఆవరణలో మొక్క నాటుతున్న వైద్యులు

గాజువాక: ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో శుక్రవారం మొక్కలు నాటారు. ప్రజా పౌర హక్కుల రక్షక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎం.సుధాకర్‌రావు, డాక్టర్ బదిరీ నారాయణ తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. సీహెచ్‌వో పి.నాగ అప్పారావు మాట్లాడుతూ పర్యావరణానికి మొక్కలు ఎంతగానో మేలు చేస్తాయని, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ విశ్వనాథ్, ప్రతినిధులు విజయ్ కుమార్ నాయక్, వి.ఎ స్.వి.ప్రసాద్, సుధాకర్, లక్ష్మణస్వామి, రాజేశ్వరి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెండు రోజుల వర్క్‌షాప్



వర్క్‌షాప్ ముగింపులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన అకడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. కళాశాల రసాయనశాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన రెండో రోజు వర్క్‌షాప్‌లో 'న్యూ ఫ్రాంటైర్స్ ఇన్ కెమికల్ సైన్స్'అంశంపై సైన్స్ అకడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. వర్క్‌షాప్ నిర్వహించడానికి అనుమతి లభించినందుకు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్క్‌షాపు విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధనలకు ఎంతగానో దోహదపడతుందని చెప్పారు. ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్ 'ఆర్గానిక్ సింథసిస్', ప్రొఫెసర్ రాజకుమార్ బల్లా 'స్పెక్ట్రోస్కోపిక్ టూల్స్', ప్రొఫెసర్ బీఎల్‌వీ ప్రసాద్ 'నానోపార్టికల్స్' అంశాలపై నూతన ఆవిష్కరణలు విద్యార్థినులకు విశదీకరించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి. కల్యాణ్‌రామ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి చేయాలి



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగే అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆయన ప్రోగ్రామ్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కుటుంబ సంక్షేమ శాఖ, మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, మాతా, శిశు మరణాల రేటు తగ్గింపు, గర్భిణులకు మందుల వినియోగం, ఇతర అంశాలపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఏఎన్‌ఎంలు ఎన్‌రోల్‌మెంట్ కరెక్ట్‌గా చేయాలని, వైద్యాధికారులు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది సమయానికి ముఖ హాజరు వేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు. అదే విధంగా పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ జూమ్ సమావేశంలో జిల్లాలో గల ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



పాఠశాలలో మొక్క నాటుతున్న హెచ్‌ఎం వినోద్ కుమార్

పెదగంట్యాడ: మానవాళి మనుగడకు మొక్కలు దోహదం చేస్తాయని చేపలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్ కుమార్ అన్నారు. వరల్డ్ ప్లాంటేషన్ డే, వరల్డ్ ఫారెస్ట్ డేలను పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటితే సరిపోదని వాటిని సంరక్షించాలన్నారు. మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మున్నీషా, పావని, సోమేశ్వరి, పూజిత, ధనలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐలో టాటా డ్రైవ్ అండ్ సీమెన్స్ ఆధ్వర్యంలో కంప్యూటర్స్‌లో కొత్త టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, బోధన పద్ధతులపై నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ నరసింహపాత్రుడు, ట్రైనర్ డాక్టర్ జాఫిన్, స్నేహాల్, ఐటీఐ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు శిక్షణ పూర్తి చేసిన 29 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యూ ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రజా మరుగుదొడ్లు



పెచ్చులూడి పడుతున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలోని ప్రజా మరుగుదొడ్లు శిథిలమయ్యాయి. శ్లాబు పెచ్చులూడి పడడంతో మహిళలు మరుగు దొడ్డిని వినియోగించుకోవడానికి భయపడుతున్నారు. అధికారులు వెంటనే దీనిని పరిశీలించి నూతన మరుగు దొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి బుధవారం పలువురు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తుంగ్లాం ప్రజలకు ఈ మరుగు దొడ్లు చాలా అవసరం అని వివరించారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

కేవీలో అడ్మిషన్లు కొనసాగించాలి



ధర్నాలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం (కేవీ)లో ఒకటో తరగతి, 11వ తరగతులకు అడ్మిషన్లు వెంటనే కొనసాగించాలని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కేవీ ముందు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతి, 11వ తరగతులకు అడ్మిషన్లు ప్రారంభించొద్దని కేంద్ర ప్రభుత్వం ఉక్కు యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీని దార్వా ఒక్కొక్క తరగతి మూసి వేయడానికి లేదా ప్రైవేటు సంస్థకు ఇవ్వడానికి సిద్ధమైందని మండిపడ్డారు. కేవీ ఉపాధ్యాయులను ఇతర కేవీలకు బదిలీ చేసి కాంట్రాక్ట్ ఉపాధ్యాయులతో ఈ కేవీని నడపడానికి చర్యలు తీసుకోబోతున్నారన్నారు. ఖర్చు తగ్గించుకోవాలనే దుర్మార్గపు చర్యలకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఒడిగట్టడం వల్లే ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. విశాఖ విమల విద్యాలయంలో కూడా ఒకటో తరగతి అడ్మిషన్లు నిలుపుదల చేశారన్నారు. ఈ అంశంపై రాష్ట్రంలోని కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి విన్నవించినా ఏ చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే యాజమాన్యం రెండు పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించకపోతే వందలాది మంది విద్యార్థులతో అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యు. రామస్వామి, వై.టి. దాస్‌తో పాటు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం దరి రాజీవ్‌నగర్‌లో దామా రియల్ ఎస్టేట్ అండ్ బిల్డర్స్ సంస్థ కల్యాణమండపం నిర్మిస్తోంది. అయితే అందులో ప్రభుత్వం భూమి ఉందని తహసీల్దార్ శ్రీవల్లి శుక్రవారం సిబ్బందితో అక్కడకు చేరుకుని పొక్లెయిన్‌తో ప్రహరీ కూలగొట్టించారు. అది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కాగా ముందస్తు సమాచారం లేకుండా నిర్మాణాలు తొలగించారని దామా రియల్ ఎస్టేట్ సంస్థ యాజమాని దామా సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. 2011లోనే సుబ్బలక్ష్మి అనే మహిళ వద్ద తమ సంస్థ భూమి కొనుగోలు చేసింది అని చెప్పారు. అప్పట్లో ఆ స్థలంలో ప్రహరీ నిర్మించామన్నారు. సర్వే నిర్వహించకుండా తమ సంస్థ నిర్మిస్తున్న కట్టడాలు తొలగించారని పేర్కొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలివ్వాలి

డాబాగార్డెన్స్: గ్రంథాలయ సిబ్బంది చిరకాలంగా కోరుతున్న 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ సిబ్బంది, పెన్షనర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల అకౌంట్‌కు జమ చేయలని, గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి గ్రాంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ వివిధ తీర్మానాలు ఆమోదించింది. అనంతరం తూర్పుగోదావరి జిల్లాతో కలుపుకుని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. మల్లేశ్వరరావు కన్వీనర్‌గా మరో 10 మందితో కమిటీ ఏర్పాటైంది. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలాది సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునికీకరిస్తామని గ్రంథాలయాలు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ నాయకులు బి. ఆనందరావు, వైకుంఠరావు, రామభద్రరాజు, ఆనందరావు, కె. శ్రీనివాసరావు వివిధ సమస్యలపై మాట్లాడారు.